


# మట్టి

కోరుకొండ సత్యానంద



చిట్టిబాబు దగ్గర్నుండి టెలిగ్రాం వచ్చింది!

వాళ్ళమ్మ పోయింది. ఆ విషయం చదివిన వెంటనే గుండె కలుక్కుమంది. ఆదరాబాదరాగా బయల్దేరవలసిందే, అప్పటికప్పుడే నా ఆలోచనలో మార్పు రాకుండా ఉండి ఉంటే!

ఆర్నెల్ల క్రితం ఇలాంటి టెలిగ్రామే వచ్చింది చిట్టిబాబు దగ్గర్నుండి.. అప్పుడు వాళ్ళ నాన్న పోయాడు. నేను నా భార్యాపిల్లల్తో అప్పటికప్పుడే బయల్దేరి వెళ్లాను. చిట్టిబాబు ఆర్థిక పరిస్థితి క్షుణ్ణంగా తెలిసిన నేను బ్యాంకులో ఉన్నదంతా డ్రా చేసి వెళ్లాను.

అప్పుడు నేనూహించినట్టే జరిగింది. నేను వెళ్లే వరకూ శవాన్ని లేవడానికి ఏ చిన్న సన్నాహమూ జరగలేదు. చిట్టిబాబు నోటితో చెప్పలేదు గానీ కన్నీళ్ళతో చెప్పాడు.

సదీ, ఇరవై లాంటి ఖర్చుల్ని మాత్రం వాళ్ళ తరఫువాడైన నాగేశ్వర్రావు అనే అతను పెట్టాడు తప్ప... మొత్తం కార్యక్రమం అంతా నా చేతుల మీద, నా చేతి ఖర్చుల మీదే జరిగింది. కార్యక్రమాలన్నీ అయ్యి తిరుగుముఖం పట్టేటప్పటికి నా ప్రయాణం ఖర్చులకే నాకు కష్టమైపోయింది. వచ్చేటప్పుడు మాత్రం నా చేతుల్ని తన కన్నీటితో తడిపేసాడు చిట్టిబాబు. ఆ కన్నీటి వేడి స్పర్శ వచ్చినప్పటికీ కదిలించి వేస్తుంది.

ఇప్పుడు మళ్లీ వాళ్ళమ్మ... విషయం తెలిసి కలుక్కుమన్న గుండె అప్పుడే వచ్చిన ఆలోచనతో రాయిగా మారిపోతున్న సమయంలో నా భార్య కూడా అంది...

"ఒకసారి అయ్యిందిగా, మళ్ళీ ఇప్పుడు వెళ్ళి చేతులు దులుపుకోకపోతే ఏం? జేబులు ఖాళీ చేసుకొనే వరకూ అభిమానాన్ని పెంచుకోగూడదు ఈ రోజుల్లో!"

నా భార్య పైకి అనేసి తేలిపోయింది గానీ, పైకి ఏమీ మాట్లాడని నాలోనూ అదే ఆలోచన... విలువ ఉన్న కాగితాలు నా గుండెను కరడు కట్టించేసాయి.

నేను ప్రయాణానికి సన్నద్ధమవ్వలేదు. నాలు కుర్చీలో కూలబడిపోయాను.

చిట్టిబాబు....

వాడు నా కంటే పదేళ్ళు చిన్నవాడు; వరుసకు తమ్ముడవుతాడు. మా ఇద్దరికీ రక్త సంబంధం లేకపోయినా, వాళ్ళ కుటుంబం, మా కుటుంబానికీ మధ్య ఉన్నది దూరపు బంధుత్వమే అయినా మా తల్లిదండ్రులు, వాడి తల్లిదండ్రులు చాలా ఆప్యాయంగా ఒకే కుటుంబంలా ఉండేవాళ్ళు మా చిన్నప్పుడు. మా రెండు కుటుంబాల మధ్య రాకపోకలు, పెట్టుపోతలు, మంచి చెడ్డలు చాలా ఎక్కువే ఉండేవి.

చిట్టిబాబు వాళ్ల తండ్రి రాజేశ్వర్రావు మేముంటున్న ఈ ఊరికి ఓ రెండొందల కిలోమీటర్ల దూరంలో ఉండే ఓ పల్లెటూళ్లో వ్యాపారం చేసి బాగానే సంపాదించాడు. ఆ ఊళ్ళో, ఆ రోజుల్లో పొరుగూరి కాన్వెంట్లో చదివిన మొట్టమొదటి కుర్రాడు చిట్టిబాబే. రోజూ రిక్షాలో వెళ్ళి, రిక్షాలో వచ్చే వాడంటే ఆ రోజుల్లో పెద్ద గొప్ప! ఒకే ఒక్క కొడుకు కావటం వలన, మంచి స్థితిలో ఉండడం వలన చిట్టిబాబు చాలా ముద్దుగా పెరిగాడు.

"జల్సాలకు, దర్జాలకూ పోయాడు. క్రికెట్ ఆటలో తగలెట్టాడు. దేనికో ధారపోసాడు.." అని రకరకాలుగా అనుకున్నా అందులో ఏది నిజమో ప్రత్యక్షంగా నాకు తెలీదు గానీ చిట్టిబాబు తండ్రి కొద్ది సంవత్సరాల్లోనే చితికిపోయాడు. ఆ కుటుంబం ఎంతలా చితికిపోయిందీ అంటే మంచి మిద్దె ఉన్న పెద్ద ఇంటిలోంచి, చిన్న తాటాకింట్లోకి మారిపోయింది. అంతేకాదు-పూటకు కూడా కష్టం అయిపోయింది!

ఆ మార్పులు జరుగుతున్నప్పుడే నేను ఓ ఉద్యోగస్తుడ్నవ్వడం, పెద్ద వాళ్ళెవ్వరూ లేని వాడినవ్వడం జరిగిపోయాయి. వాళ్ళు మా ఇంటికి రావడం, నేను వాళ్ళింటికి వెళ్ళడం కూడా తగ్గిపోయింది.

నా పెళ్ళికి చిట్టిబాబు ఒక్కడే వచ్చాడు.

"పిన్నీ, బాబాయీ ఏరిరా?" అని అడిగాను.

"రావాలని చాలా సరదా పడ్డారన్నయ్యా, కానీ దారి ఖర్చులకి కూడా....."

వాళ్ళ పరిస్థితులు తెలిసి బాధపడ్డం అలవాటైపోయిన నేను పెళ్లి హడావుడిలో పడిపోయాను.

నా పెళ్ళైన నెల రోజులకి మా బాబాయి, పిన్ని ఇద్దరూ వచ్చారు. నా దగ్గర కన్నీళ్లు పెట్టుకున్నారు.

"మీ అమ్మ, నాన్న లేనందుకు తల్లిదండ్రులమై

దగ్గరుండి అన్నీ మేమే జరిపించి ఉండాల్సింది. కానీ చితికిపోయిన మేము నీ కోసం ఏం చేయగలం బాబూ? అందుకే సిగ్గుపడి పెళ్లికి రాలేకపోయాం'' అంది పిన్ని.

బాబాయి ఏమీ మాట్లాడలేదు గానీ చాలా బాధ పడుతున్నట్టుగా నాకు అనిపించింది.

చిన్నతనంలో వాళ్ళు రావడం, పోవడం మానినేమో గానీ వాళ్ళకు నా మీద అంత అభిమానం ఉంటుందని, నా పెళ్ళికి రానందుకు వాళ్లు అంతలా ఫీలవుతారని నేనూహించలేదు. నా మనసులో వాళ్ళు అంతగా ముద్రపడి ఉండి ఉంటే వాళ్ళ పరిస్థితి తెలిసిన నేను పెళ్ళికి రమ్మనమని కార్డు మాత్రమే ఎందుకు పంపి ఉంటాను, దగ్గరుండి పది రోజుల ముందుగా తీసుకొని వచ్చి ఉండేవాడిని కాదా?

అలా చేయనందుకు మాత్రం నేనప్పుడు చాలా బాధపడ్డాను. అప్పటినుండే నాకు వాళ్ళు కాస్త మానసికంగా దగ్గరయ్యారు.

చదువు పూర్తిగా సాగని చిట్టిబాబుకి స్థిరమైన ఉపాధి లభించలేదు. ఏదో చేసి కాస్త సంపాదించేవాడు. ముసలివాళ్ళైపోయిన తల్లిదండ్రులకి ఓ పూట గంజినీళ్ళు పోసేవాడు.

ఆర్నెల్ల క్రితం తండ్రినీ, ఇప్పుడు తల్లినీ కోల్పోయి ఒంటరివాడయ్యాడు. వాడికి నాకంటే దగ్గర బంధువులున్నా ఎవ్వరూ అక్కరకు రారు అని బాబాయి పోయినప్పుడు నాకు అర్థం అయింది...

కానీ, ఇప్పుడు... నేను కూడా...

ఆ ఆలోచనతో నా మనసు పాడైపోయింది. బయల్దేరి వెళ్తే బాగుండునేమో అని అనిపిస్తూంది. కానీ చేతిలో ఉన్న డబ్బు వేరొకరి అవసరానికి ఖర్చు చేయబుద్ధి కావడం లేదు. వాడికి నా కంటే దగ్గరి వాళ్ళైన వాళ్ళే పట్టనట్టు ఊరుకున్నప్పుడు నేనిలా ఆశించడంలో తప్పేముంది అని అనిపిస్తూంది. వెళ్ళాలని, వెళ్ళడం ఎందుకులే అని మనసు ఊగిసలాడుతున్నా చివరికి నేను వెళ్ళలేదు.

"నీవొస్తావని ఎదురుచూసి చూసి శవాన్ని ఎంతసేపుంచుతావని వీధిలో వాళ్ళు చేసిన ఒత్తిడిని కూడా అతి కష్టం మీద కొన్ని గంటలు తట్టుకుని చివరకు అమ్మ శవాన్ని కాటికి తరలించేసానన్నయ్యా... కనీసం ఈ కార్యక్రమానికైనా నువు తప్పకుండా వస్తావని ఆశిస్తున్నాను''

పదకొండో రోజు కార్యక్రమానికి రమ్మని చాలా పెద్ద ఉత్తరం రాసాడు చిట్టిబాబు. వాడు ఆ ఉత్తరం రాసిన విధానానికి నేను చాలా బాధ పడ్డాను.

ఆ కార్యక్రమానికైనా వెళ్లాలని నిర్ణయించుకున్నాను.

"బాగుండదనుకుంటే వెళ్ళండి... అయితే ఆ రోజుకల్లా అక్కడ ఉండేలా వెళ్లండి. ముందుగా వెళ్ళకండి... ఈ కార్యక్రమానికి కూడా డబ్బు అవసరం ఉంటుంది'' అంది నా భార్య.

నేను కార్యక్రమం జరిగే రోజునే బయల్దేరి



వెళ్లినా, ఎందుకైనా అవసరమొస్తుందని కాస్త డబ్బు జేబులో వేసుకొనే వెళ్లాను.

నేను ఆ కార్యక్రమానికి వెళ్ళడం చిట్టిబాబుకి చాలా ఆనందం కలిగించిందని, తల్లిని కూడా కోల్పోయిన వాడి ఆవేదన తీర్చుకునే సన్నిహితమైన మనిషిని అందరికంటే వాడికి నేనేనని వాడు నా గుండెల మీద పడి భోరున ఏడ్చిన ఆ తీరే నాకు తెలియజెప్పింది. పిన్ని శవాన్ని చూడ్డానికి నేను కావాలనే, కేవలం డబ్బు కోసమే వెళ్ళనందుకు నిజంగా నేనప్పుడు చాలా బాధపడ్డాను.

అబద్ధం చెప్పినా వాడు నా మాటని నమ్ముతాడన్న నమ్మకంతో నేనప్పుడు రానందుకు కారణంగా ఓ అబద్ధాన్ని చెప్పాను.

వాడు నమ్మాడు, కాసేపటికి తేరుకొని కార్యక్రమంలో పడిపోయాడు.

అప్పుడు బాబాయి పోయినప్పుడు పదీ ఇరవై లాంటి ఖర్చుల్ని చేసిన నాగేశ్వర్రావు అనే అతను కూడా ఆ కార్యక్రమానికి వచ్చాడు.

భోజనాలైన తర్వాత ఇద్దరమూ మాటల్లో పడ్డాం.

"మీరొస్తారని నేను చాలా ఎదురుచూసానండి ఆ రోజు...''

చిట్టిబాబుకి చెప్పిన అబద్ధమే అతనికీ చెప్పాను.

"వాళ్ళ నాన్న పోయినప్పుడు మనిషిగానే కాకుండా ఆర్థికంగా చాలా సాయం చేసారండీ చిట్టిబాబుకి. ఎప్పుడు కన్పించినా వాడు నాకు అదే చెప్తుంటాడు. వాళ్ళమ్మ పోయినప్పుడు మీ కోసం ఎంతో ఎదురుచూసి చాలా బాధ పడుతూ తల్లి శవాన్ని భుజాన వేసుకున్నాడు. దారిలో నైనా ఎదురౌతారేమోనని చాలా ఆత్రంగా చూసాడు!''

ఆ మాటలు నా మనసుని నలిపేసాయి. నేను తల పంకించడం తప్ప ఏమనడానికీ మాట పెగిలింది కాదు.

"చిన్న కుర్రాడు.... ఈ వయసులో ఎన్నో కష్టాలు ఆ కుర్రాడికి... మీరు రాలేదు. వచ్చిన నేను తప్ప ఎవ్వరూ ముందుకు రాలేదు ఏ కార్యక్రమానికీను. అందుకే అప్పటికప్పుడు ఓ చోట అప్పు తెచ్చి చిట్టిబాబుకి ఇచ్చాను...''

అప్రయత్నంగానే నేను తల దించుకున్నాను.

"....కానీ...చిట్టిబాబు ఆ డబ్బుని తీసుకోలేదు....''

చివుక్కున తలెత్తి చూసాను అతనివైపు.

"అవునండీ.. పరిస్థితి తెలిసిన నేను చిట్టిబాబు అడక్కుండానే డబ్బు తెచ్చి ఇచ్చాను... కానీ చిట్టిబాబు ఆలోచన వేరుగా ఉంది.. ఏమీ అనుకోవద్దని చెప్పివిషయం చెప్పాడు చిట్టిబాబు..''

అతను చెప్పబోయే విషయాన్ని వినడానికి నేను ఆసక్తిగా, ఆతృతగా చూసాను.

"- మా నాన్న పోయినప్పుడు మా అన్నయ్య డబ్బుతో, మీ డబ్బుతో మా నాన్నని ఖననం చేసాను. కొడుకునైన నేను ఏమీ చేయలేకపోయాను. అమ్మ పరిస్థితి తెలిసిన నేను ఎప్పటికైనా అమ్మ కూడా మట్టిలో కలిసిపోతుంది కదా, అప్పుడు కూడా కొడుకునైనందుకు ఏమీ చేయలేకపోతే అమ్మ నన్ను మోసి, కష్టపడి కని, పెంచినదానికి ఫలితం ఉండదని.. నాన్న పోయినప్పటి నుండే నేను సంపాదించేది ఇల్లు గడవడానికే సరిపోనిదైనా, నాన్న ఉండి ఉంటే అతని కోసం కొంతైనా ఖర్చు చేయాల్సి ఉండేది కదా అని...దాన్లోంచే కొంచెం కొంచెం తీసి దాచాను, కేవలం అమ్మను మట్టి చెయ్యడానికయ్యే ఖర్చుల కోసమని. ఆ డబ్బు నా దగ్గరుందండీ, దాంతోనే కార్యక్రమాలన్నీ చేస్తాను. ఈ సారి ఈ ఖర్చులకయ్యే ప్రతి పైసా నా కష్టార్జితమే అవ్వాలి. అందుకే మీరిస్తున్న డబ్బుని వద్దంటున్నాను. మీ అభిమానానికి కృతజ్ఞతలు. ఇలా అన్నానని ఏమీ అనుకోకండి...' అని అన్నాడండీ... నేనింకేం చేయగలను, ఎక్కడ తెచ్చానో అక్కడికే పట్టుకెళ్ళి ఇచ్చేసాను ఆ డబ్బుని....''

అతనింకా ఏవో మాట్లాడుతున్నాడు గానీ...అతని మాటలకు నా గుండె పగులుతున్నదని అతడు గమనించి ఉండడు.

## పావురాల ఫ్యాక్టరీ

ప్రపంచమే ఆయుధాల ఫ్యాక్టరీ అయినపుడు
పావురాలైనా తెరుస్తాయి సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్
స్కీము కింద అణు రియాక్టరీ!
ఆకలి పేగులకు మెతుకుల్లేకపోయినా.
రేషన్ కార్డుల మీద తొడగడానికి
నడిచే కళేబరాల కోసం తెరుస్తారు
జరీ చీరల ఫ్యాక్టరీ!

—చల్లా రామఫణి